నేటి కందం- నేటికి అందం



మన రైతులు ముదమొందగ
మనదేశము వృద్ధి నొంద మాన్యతతోడన్
ధనధాన్యకృషి ప్రణాళిక
ఘనతరముగ మొదలిడబడె కర్మణ్యులచేన్ !!

బడ్జెట్ లో చెప్పినట్లు ధనధాన్య కృషి యోజన ను ఈరోజు కేంద్రం ఆమోదించింది

-రాధశ్రీ
సెల్:9494481210




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 18-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:257 పేజీలు:6 వెల: రూ.1/-


## డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టిన లారీ.. రోడ్డుపై పడిపోయిన టమాటాలు

హైదరాబాద్, జులై 17:హైదరాబాద్ శంషాబాద్ సమీపంలో టమాటాల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. శంషాబాద్ నుంచి గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌కు వెళ్తున్న సమయంలో లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. లారీ బోల్తా కొట్టడంతో అందులో ఉన్న టమాటాలు మొత్తం రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి.పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే డైరీ ఫార్మ్ చౌరస్తా వద్ద ఈ ప్రమాదం జరిగింది. అయితే టమాటాల లోడ్‌తో వెళ్తున్న రైతులు ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడం విశేషం. కాగా, ఈ ఘటనతో రహదారిపై చాలాసేపటి వరకు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఘటనస్థలికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో లారీని పక్కకు తీశారు. అనంతరం రోడ్డుపై పడిన టమాటాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

# ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

-నెల రోజుల పాటు లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు
-కీలకమైన ఎనిమిది బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం
-పలు అంశాలపై ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు రెడీ
-పహల్గామ్ ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్‌పై హాట్ హాట్ చర్చ

న్యూఢిల్లీ, జులై 17:పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సమావేశాలు ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. వాస్తవానికి



ఈ సమావేశాలు ఆగస్టు 12వ తేదీ వరకే నిర్వహించాలని అనుకున్నారు. కానీ, తర్వాత ఆగస్టు 21వ తేదీ వరకు పొడిగించారు. ఈసారి సమావేశాలు హాట్ హాట్‌గా సాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పహల్గామ్ ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత పార్లమెంట్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అంశాలను ప్రతిపక్షాలు కీలకంగా ప్రస్తావించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వాస్తవంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కానీ, అందుకు అధికార పార్టీ నిరాకరించింది. ఇక.. బీహార్ ఎన్నికల ముందు ఈసీ చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌పై కూడా సభలో కాంగ్రెస్ లేవనెత్తే అవకాశం ఉంది.

ఎనిమిది బిల్లులు, కీలక చర్చలు..

ఈ సమావేశాల్లో ఎనిమిది బిల్లులు ప్రవేశపెట్టాలని కేంద్రం కసరత్తు చేస్తోంది. ఆదాయపు పన్ను సంస్కరణ, క్రీడా పాలన, భూ వారసత్వ సంరక్షణతో సహా 8 బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు కోసం ప్రభుత్వం ఉభయ సభల ఆమోదాన్ని కోరనుంది. ఫిబ్రవరి 13, 2025న రాష్ట్రపతి జారీ చేసిన ప్రకటన ద్వారా మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. అంతేకాకుండా.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం కూడా ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అలాగే నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, జియోహెరిటేజ్ సైట్స్, జియో రెలిక్స్ (సంరక్షణ, నిర్వహణ) బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్ (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, నేషనల్ యాంటీ డోపింగ్ (సవరణ) బిల్లు, మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ) బిల్లులు ప్రవేశపెట్టే చాన్సుంది. కాగా, అధికార-ప్రతిపక్షాలు వ్యూహాలు, ప్రతి వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రతిపక్షాన్ని దీటుగా ఎదుర్కొనేందుకు అధికార పార్టీ సిద్ధపడుతోంది.

## హైదరాబాద్ లో వర్షం దంచుడు.. అనేక ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, జులై 17: ఉదయం నుంచి ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలపై వరుణ దేవుడు కరుణించాడు .. నేటి సాయంత్రం ఒక్కసారిగా హైదరాబాద్ లోని పలు ప్రాంతాలలో వర్షం దంచికొట్టింది. ఫిల్మ్ నగర్, మణికొండ, బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్ పేట్, ఖైరతాబాద్, లక్డీ కా పూల్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం దెబ్బకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆఫీస్?లు ముగించుకుని సాయంత్రం ఇళ్లకు వెళుతున్న ఉద్యోగులు ట్రాఫిక్?లో చిక్కుకుపోయి నానా యాతన పడ్డారు.

శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ ప్రాంతాలలో కూడా వర్షం కురిసింది. కేబీఆర్ పార్క్, పరిసర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టడంతో ఫుల్ ట్రాఫిక్ జాం అయింది. వాయుగండం కారణంగా తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష సూచన చేసింది. గురు, శుక్ర, శనివారం.. ఈ మూడు రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది.

హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని కూడా తెలిపింది. జనగాం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు మోస్తారు వర్ష సూచన చేసింది.

# కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదు - రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, జులై 17:ఫోన్ ట్యాపింగ్ కేసు లో విచాణను వేగవంతం చేశామని, త్వరలోనే నిజాలన్నీ బయటకు వస్తాయని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . కేసులో విషయంలో తాను అనవసర హడావుడి చేయబోనని అంటూ కానీ, కేంద్రం ఈ విషయంలో తలదూర్చుతూ అడ్డు పడుతోందని ఆరోపించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ ఇవాళ మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు లో జరిగిన అవినీతిపై ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు.. తాము అధికారంలోకి వచ్చాకే అరెస్టులు చేస్తున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కేసీఆర్ కుటుంబాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కాపాడేందుకు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని.. అందుకే కాళేశ్వరంతో పాటు ఫోన్ ట్యాపింగ్ కేసులను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ వారి చెప్పుచేతల్లోనే ఉన్నాయి కాబట్టి పని సులువు అవుతుందనే భావనలో కిషన్ రెడ్డి ఉన్నారేమోనని కామెంట్ చేశారు.



### లోకేష్ తో కేటీఆర్ భేటి వెనుక ..

కాగా, నారా లోకేశ్‌ను కేటీఆర్ రహస్యంగా కలిశారని.. అర్ధరాత్రి పూట డిన్నర్ మీట్ పెట్టడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఇక కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన చెల్లి కవితే ఒప్పుకోవడం లేదని పేర్కొన్నారు. కొడుకు కేటీఆర్‌కు కేసీఆర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదాను ఇవ్వడం లేదని.. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంటో లేక స్లీపింగ్ ప్రెసిండెంటో తనకు తెలియదని సెటైర్లు వేశారు. ముందు ఆయన కుటుంబం అంతా ఒక తాటిపైకి రావాలని, ఆ తరువాత రాష్ట్ర ప్రజల గురించి ఆలోచించాలని హితవు పలికారు. తనకు ఎవరితో ఎలాంటి శత్రుత్వాలు.. వైరుధ్యాలు లేవని.. కేసీఆర్ కేవలం తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని రేవంత్ అన్నారు.

### సమస్యల పరిష్కారానికి ఫామ్ హౌస్ కా..

రాష్ట్ర సమస్యల పరిష్కారానికి ఢిల్లీకి కాకపోతే.. ఫామ్‌హౌస్‌కు వెళ్లాలా అంటూ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పదే పదే సీఎం ఢిల్లీకి వెళ్తున్నాడని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న కామెంట్స్‌పై ఆయన ఫైర్ అయ్యారు. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయన్నారు. బనకచర్ల పై జలశక్తి సమావేశంలో ఏం జరిగిందో కేంద్రమే చెప్పిందని తెలిపారు. దీనిపై మాట్లాడేందుకు ఏమీ లేదన్నారు.

## ఫైర్ & సేఫ్టీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జులై 17:ఫైర్‌ & సేఫ్టీ కోర్సులకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఔలు సెంటర్ ఫర్ ఫైర్‌ & సేఫ్టీ ఇంజనీరింగ్ విభాగం డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.

ఫైర్‌ & సేఫ్టీ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు పేరొందిన ఎయిర్‌పోర్టు, ఆయిల్ కంపెనీ, గ్యాస్ ఇండస్ట్రీస్, స్టార్ హోటల్స్, ఫార్మా ఇండస్ట్రీస్, రైల్వే, వివిధ కార్పొరేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చని అడపా వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీయువకులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6302355872 లేదా www.ncttin dia.com లో సంప్రదించాలని కోరారు.

# గోషామహల్‌లో ముగిసిన బోనాల ఉత్సవాలు



హైదరాబాద్, జులై 17: హైదరాబాద్ గోషామహల్ పరిసర ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు ముగిశాయి. పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలలో మహిళలు సాంప్రదాయ దుస్తులను ధరించి అమ్మవారికి బోనాలను సమర్పించడంతో పాటు ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని కనుల పండుగగా నిర్వహించారు.

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాలు నిర్వహించిన మరుసటి బుధవారం గోషామహల్ పరిసర ప్రాంతాలలో బోనాల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బోనాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు చేపట్టారు. పోతరాజు ఆట పాటల మధ్య యువకులు కేరింతలు కొడుతూ అమ్మవారి ఆలయాలకు చేరుకుని బోనాలను సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గోషామహల్, చందన్ వాడి, గౌలిగూడ, మహారాజ్ గంజ్, అశోక్ బజార్, కిషన్‌గంజ్ తదితర ప్రాంతాలలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోషామహల్‌లోని ఐదుగుళ్ల దేవాలయం, ఏడుగుళ్ల దేవాలయం, భైరవిమాత ఆలయం, దుర్గామాత దేవాలయాలతో పాటు పరిసర ప్రాంతాలను అమ్మవారి ఆలయాలకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బోనాలను సమర్పించుకున్నారు.

ఘనంగా ఫలహారం బండ్ల ఊరేగింపు

బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని గోషామహల్ పరిసర ప్రాంతాలలో ఫలహారం బండ్ల ఊరేగింపును అత్యంత ఘనంగా నిర్వహించారు. రాత్రి వరకు ఫలహారం బండ్ల ఊరేగింపు కనుల పండుగగా సాగింది. భైరవి మాత దేవాలయం, గోషామహల్, చందనవాడి తదితర ప్రాంతాల నుంచి ఫలహారం బండ్ల ఊరేగింపును నిర్వహించారు. స్థానిక ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రాంతాలలో స్వాగత వేదిక లను ఏర్పాటు చేసి ఫలహారం బండ్లకు స్వాగతం పలికారు. మహిళలు సంప్రదాయ దుస్తులను ధరించి అమ్మవారికి బోనాలను సమర్పించగా నిర్వాహకులు పెద్ద ఎత్తున ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు.

# అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల అమలు-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

-నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది

రాజన్న సిరిసిల్ల, జులై 17:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేస్తుందని, ఇందులో భాగంగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి వేములవాడ పట్టణంలో గల మహా లింగేశ్వర గార్డెన్స్ లో వేములవాడ రూరల్, అర్బన్ మండలానికి చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ×ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ,× నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. పేద ప్రజలకు రేషన్ కార్డు ఒక గుర్తింపు కార్డు గా మారిందని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రేషన్ కార్డు తో పాటు గత ఉమ్మడి రాష్ట్రంలో 2 లక్షల రూపాయల ఆరోగ్యశ్రీ కార్డు అప్పటి ప్రభుత్వం అందించిందని, ప్రస్తుతం మన ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డు పొందిన ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందని అన్నారు. పేద ప్రజలు అనారోగ్యంతో బాధపడితే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ క్రింద చికిత్స పొందే అవకాశం లభించిందని అన్నారు. నేడు వేల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి అర్హులకు రేషన్ కార్డులను మంజూరు చేయడంలో కృషిచేసిన అధికారులకు ప్రభుత్వ విప్ అభినందనలు తెలిపారు.



రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా చేయడం ఉగాది నుంచి ప్రారంభించామని, దీనితో రేషన్ కార్డ్ ప్రాముఖ్యత గణనీయంగా పెరిగిందని అన్నారు. రేషన్ కార్డు పొందిన లబ్ధిదారుల్లో భవిష్యత్తులో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలలోని మహిళలకు 10 లక్షల రూపాయల ప్రమాద బీమా, 2 లక్షల రూపాయల లోన్ బీమా కల్పించామని అన్నారు. పెట్రోల్ బంక్, ఆర్టిసి కు అద్దె బస్సుల ఏర్పాటు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు అనేక రంగాలలో స్వయం సహాయక మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని, ఆదానీ , అంబానీ లకు పోటీగా మన మహిళలు వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు. ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ప్రభుత్వ విప్ ధ్వజమెత్తారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు. ఆరోగ్య శ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు.

500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, 25 లక్షల రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40% డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని అన్నారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,× వేములవాడ అర్బన్ మండలంలో 353, రూరల్ మండలంలో 174 నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, వీటి ద్వారా దాదాపు 3,000 మంది పేదలకు అదనంగా రేషన్ అందుతుందని అన్నారు. ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ , ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్ , ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో నూతనంగా 14 వేల లబ్దిదారులకు రేషన్ అందించేందుకు కార్డులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి లబ్దిదారుడికి నెలకు అదనంగా 6 కిలోల సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని అన్నారు

ఈ కార్యక్రమంలో వేములవాడ కమిటీ మార్కెట్ చైర్మన్ ఆర్.రాజు, డిఎం సివిల్ సప్లై రజిత తాసిల్దార్లు , లబ్దిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశాలో మరో విద్యార్థిని లైంగికంగా వేధించిన ప్రొఫెసర్

భువనేశ్వర్, జులై 17: ఒడిశాలో మరో విద్యార్థిని ప్రొఫెసర్ లైంగికంగా వేధించాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. హెచ్‌వోడీ లైంగిక వేధింపులు భరించలేక విద్యార్థిని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన తర్వాత తాజాగా ఇది బయటపడింది. పశ్చిమ ఒడిశాలోని సంబల్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. గంగాధర్ మెహర్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ గోపీచంద్ సునా ఒక విద్యార్థిని లైంగికంగా వేధించాడు. ప్రభుత్వ క్వార్టర్స్‌కు ఆమెను రప్పించి వేధింపులకు గురి చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులను ధృవీకరించిన తర్వాత ప్రొఫెసర్ గోపీచంద్ సునాను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కాగా, బాలసోర్‌లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో బీఈడీ చదువుతున్న విద్యార్థిని హెచ్‌వోడి లైంగికంగా వేధించాడు. తన కోరిక తీర్చకపోతే ఆమె భవిష్యత్తును నాశనం చేస్తానని బెదిరించాడు. ఆ లెక్చరర్ వేధింపులు భరించలేని ఆ విద్యార్థిని సోమవారం నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

# ప్రభుత్వంలో కలవాలన్న ఆహ్వానం తర్వాత.. ఫడ్నవీస్‌ను కలిసిన ఉద్ధవ్ ఠాక్రే



ముంబై, జులై 17: మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే గురువారం కలిశారు.కుమారుడు ఆదిత్య ఠాక్రే కూడా ఆయన వెంట ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ఉద్ధవ్ ఠాక్రే పాలకపక్షంలోకి మారాలని అసెంబ్లీ వేదికగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఆహ్వానించిన ఒక రోజు తర్వాత ఇది జరిగింది.

శాసన మండలి చైర్‌పర్సన్ రామ్ షిండే గదిలో సీఎం దేవేంద్ర ఫడ్నవీన్, ఉద్ధవ్ ఠాక్రే సమావేశమయ్యారు. సుమారు 20 నిమిషాలపాటు వీరిద్దరూ మాట్లాడుకున్నారు.

అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి నియామకం, వివాదాస్పద త్రిభాషా విధానం వంటి అంశాలపై చర్చించారు.

కాగా, మహారాష్ట్రకు చెందిన వివిధ సంపాదకులు రాసిన వ్యాసాల సంకలనం 'మనకు హిందీ ఎందుకు అవసరం' అనే పుస్తకాన్ని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఉద్ధవ్ ఠాక్రే అందజేశారు. త్రిభాషా విధాన నిర్ణయాన్ని సమీక్షించే కమిటీకి నేతృత్వం వహిస్తున్న నరేంద్ర జాదవ్‌కు కూడా ఆ కాపీ ఇవ్వాలని ఆయన కోరారు.

మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు, మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే కూడా ఆయన వెంట ఉన్నారు. 1వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ అనేక మంది జర్నలిస్టులు, సంపాదకులు రాసిన వ్యాసాల సంకలనాన్ని సీఎం ఫడ్నవీస్‌కు అందజేసినట్లు ఆదిత్య ఠాక్రే తెలిపారు.

# నాణ్యమైన బొగ్గు సరఫరాకు చర్యలు : సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు

ఖమ్మం, జులై 17:వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు అన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జెవిఆర్ ఓ.సి, జెవిఆర్ సి.హెచ్.పి ని డైరెక్టర్ పా సందర్శించారు. ముందుగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు కొత్తగూడెం ఏరియా తరపున పూల మొక్కను బహుకరించి, శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం జనరల్ మేనేజర్ క్యాంప్ కార్యాలయంలో జేవిఆర్‌ఓసి, కిష్టారం ఓసీ ఉపరితల గనుల మ్యాపుల ద్వారా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్, సంబంధిత ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఉపరితల గనుల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా జీఎం నూతనంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టు వికే ఓ.సి ఉపరితల మైన్ వివ రాలను, వాటి రికార్డులను వివరించారు.అనంతరం జెవిఆర్ ఓ.సి ని సందర్శించి వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిం చారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జి.ఎం షాలెం రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొగ్గు ఉత్పత్తి , రవాణా, రోజు వారి లక్ష్యాలను అధిగమించి రవాణాకు ఆటంకాలు కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలన్నారు. అనంతరం జేవిఆర్ ఓసి వ్యూ పాయింట్ వద్ద మొక్కలను నాటారు. జెవిఆర్ సి.హెచ్.పి లోడింగ్ పాయింట్ ను సందర్శించి సి.హెచ్. పి నందు రైలు మార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా గురించి, బంకర్ నుండి దుమ్ము ధూళి వెలవడకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు.

ఉత్పత్తి అయిన బొగ్గు రవాణా చేయాలని, బొగ్గు గ్రేడ్ లను పరిశీలించి నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలనీ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు ఎస్ ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి, ఏరియా ఇంజినీర్ కె.సూర్యనారాయణ రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జేవిఆర్ ఓసి ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసి ఎంవి. నరసింహారావు, జెవిఆర్ సి.హెచ్.పి డీజీఎం (ఈఎం) కె. సోమశేఖర్, డీజీఎం (పర్సనల్) జి.వి.

# నల్లజాతి మండే సూర్యుడు మండేలా !

**(18 జూలై "అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం" సందర్భంగా)**

దక్షిణ ఆఫ్రికా జాతి వివక్ష వ్యతిరేక పోరాటయోధుడు, న్యాయవాది, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సి) నాయకుడు, దాణశీలి, ప్రజాసేవకుడు, ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వంలో తొలి నల్లజాతి దేశాధ్యక్షుడు (1994-99), 27 ఏండ్ల పాటు జైలు జీవితం అనుభవించిన అవిశ్రాంత నల్లజాతి ప్రతినిధి అయిన నెల్సన్ మండేలా పుట్టిన రోజు (18 జూలై 1918) సందర్భంగా ఐరాస చొరవతో ప్రతి ఏట 18 జూలై రోజున "అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ నెల్సన్ మండేలా"ను పాటించడం 18 జూలై 2010 నుంచి ప్రారంభం అయ్యింది. దక్షిణ ఆఫ్రికాలోని "మ్వెజో" గ్రామంలోని "తెంబూ రాయల్" కుటుంబంలో జన్మించిన మండేలా వంశంలో తొలి విద్యావేత్తగా పోర్ట్‌హేర్, విట్‌వాటర్స్రాండ్ యూనివర్సిటీల్లో బిఏ, న్యాయ పట్టాలు పొంది ఉన్నత విద్యావేత్తగా పేరు తెచ్చుకొని, లాయర్‌లా పని చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు తన పేరు ముందు నెల్సన్‌ను చేర్చడంతో నెల్సన్ మండేలా అనే పేరు ఖ్యాతిలోకి వచ్చింది.

### ఉద్యమాలే ఊపిరిగా సాగిన జీవితం:

1943లో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాలు ప్రారంభించిన మండేలా ఏఎన్‌సి పార్టీలో చేరి శ్వేతజాతి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. వర్ణ వివక్ష పోరాటంలో చురుకుగా పాల్గొనడంతో అరెస్టు కూడా అయ్యారు. ఇదే క్రమంలో మర్క్సిజం వైపు ఆకర్షితులై దక్షిణ ఆఫ్రికా కమ్యూనిస్టు పార్టీలో చేరి రహస్యంగా ఉద్యమాలు చేశారు. శాంతియుతంగా పోరాటం చేస్తూ "ఉమ్కోంటో వీ స్విజ్వే" అనే తీవ్రవాద సంస్థను స్థాపించారు. నాటి శ్వేత జాతి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ, 12 జూన్ 1963 రోజున యావజ్జీవ కారాగార శిక్షను విధించడంతో 27 ఏండ్ల పాటు సుదీర్ఘ జైలు జీవితం అనుభవిస్తూ అంతర్జాతీయ మానవాళి దృష్టిని ఆకర్షించారు. జాతీయ, అంతర్జాతీయ ఒత్తిడులకు లొంగిన నాటి ప్రభుత్వం 11 ఫిబ్రవరి 1990న విడుదల చేసింది. జైలులో 466 గదిలో బంధించబడి 63 (1963)లో విడుదల కావడంతో 46663ని మండేలా సంఖ్యగా పిలవబడం జరుగుతోంది.

### తొలి నల్లజాతి దక్షిణ ఆఫ్రికా దేశాధ్యక్షుడు:

విడుదల అనంతరం నాటి శ్వేతజాతి ప్రభుత్వంతో జరిపిన చర్చల ఫలితంగా 1994లో నిర్వహించిన ఎన్నికల్లో ఏఎన్‌సి పార్టీ నేతృత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో నల్లజాతికి చెందిన తొలి అధ్యక్షుడిగా సేవలు అందించారు. వర్ణ వివక్షను రూపుమాపే కొత్త రాజ్యాంగాన్ని రూపొందించారు. భూసంస్కరణలు, పేదరిక నిర్మూలన, స్వపరిపాలనలకు పట్టం కట్టిన మండేలా నల్లజాతి ఉద్ధారకుడిగా చరిత్రలో నిలిచిపోయారు. 1998-99 మధ్య అలీనోద్యమం సెక్రెటరీ జనరల్‌గా విశిష్ట సేవలు అందించారు. రెండవ దఫా అధ్యక్షుడిగా సేవలు అందించడాన్ని ఇష్టపడకుండా తన పేరున ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి పేదరిక నిర్మూలన, హెచ్ఐవి-ఎయిడ్స్ వ్యతిరేక పోరాటాలు చేశారు.

### ఏ లాంగ్ వాక్ టు ఫ్రీడం - మండేలా జీవితం:

"అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం" సందర్భంగా పేదరిక నిర్మూలన కేంద్రంగా అన్నదాన కార్యక్రమాలు, వృద్ధుల పట్ల ఆదరణ, యువతకు ప్రేరణాత్మక కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవలు, పరిసరాల పరిశుభ్రత లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. వర్ణ సమానత్వం, స్వేచ్ఛాయుత పౌర సమాజం, సమానావకాశాల కల్పన, సుహృద్భావ వాతావరణం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అందరికీ అందుబాటులో విద్య లాంటి కనీస అంశాలకు అంకితభావంతో సేవలు అందించిన నల్లజాతి వెలుగుల సూరీడు మండేలా నేటి యువతకు నిత్య ప్రేరణగా నిలుస్తూ, భవిష్యత్తుకు దారులు చూపే దారి దీపం అవుతున్నారు. "ఏ లాంగ్ వాక్ టు ఫ్రీడం" అనబడే పేరుతో ఆత్మకథను రాసిన మండేలాను "దక్షిణ ఆఫ్రికా గాంధీ"గా పిలవడం సముచితంగా వుంది. మండేలా 67 ఏండ్ల జీవితాన్ని ప్రేరణగా తీసుకొని 67 నిమిషాలు ప్రజాహిత సేవలో అందరం గడిపి ఆయనకు అసలైన నివాళి అర్పించాలి.

సామాజిక న్యాయమే ఊపిరిగా జీవించిన ప్రజాస్వామ్య జ్యోతి మండేలాను భారత రత్న, నోబెల్ శాంతి బహుమతి, దక్షిణాఫ్రికా జాతి పిత, జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ సయోధ్య పురస్కారం లాంటి 250కి పైగా పురస్కారాలు ఆయన్ని వరించి మురిసి పోయాయి. ప్రతిష్టాత్మక 'మడిబా' అనే బిరుదును పొందిన మండేలా 05 డిసెంబర్ 2013న తుది శ్వాస విడిచారు.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కక్ష్యలో విశ్వబంధు... ప్రపంచ అంతరిక్ష భాగస్వామ్యాన్ని పునరుద్ఘాటించిన భారత్

న్యూఢిల్లీ, జులై 17:ఆక్సియం-4 అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకుని భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా సురక్షితంగా తిరిగి వచ్చారు. దీనిపై మంగళవారం కేంద్ర అంతరిక్ష శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్పందిస్తూ- "ఇది యావత్ ప్రపంచానికీ గర్వకారణం... భారత్ కీర్తిపతాక అంతర్జాతీయంగా రెపరెపలాడిన క్షణం" అని అభివర్ణించారు. ప్రపంచ అంతరిక్ష రంగంలో మన దేశం తనదైన శాశ్వత స్థానం సముపార్జించుకున్నదని పేర్కొన్నారు.

శుభాంశు శుక్లా పునరాగమనాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం శాస్త్రవేత్తలు, మీడియా ప్రతినిధులు, సీనియర్ అధికారులతో ఆయన ముచ్చటించారు. "ఆదర్శప్రాయుడైన భరతమాత ప్రియ పుత్రులలో ఒకరు క్షేమంగా తిరిగి వచ్చారు. దీంతో అంతరిక్ష రంగంలో భారత్ తనదైన శాశ్వత స్థానాన్ని సాధించిందని" అని మంత్రి వ్యాఖ్యానించారు.

ఆక్సియం-4 వాణిజ్య నౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన నలుగురు వ్యోమగాములలో కీలక సభ్యుడు, భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన గ్రూప్ కెప్టెన్ శుక్లా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత భూమికి తిరిగివచ్చారు. ఈ మేరకు 'స్పేస్ ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ గ్రేస్' వారిని శాన్ డియాగో తీరంలో పసిఫిక్ మహా సముద్రంలో క్షేమంగా దింపింది. దీంతో 'ఐఎస్ఎస్'లో 18 రోజులున్న ఈ అంతరిక్ష నౌక 22.5 గంటల తిరుగు ప్రయాణాన్ని పూర్తి చేసింది.

ప్రపంచ అంతరిక్ష పరిశోధనలలో ఇనుమడిస్తున్న భారత్ స్థాయిని ఈ మిషన్ ప్రస్ఫుటం చేసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. "ఇవి మునుపెన్నడూ చేయని ప్రయోగాలు. ప్రస్తుత ఘనత భారత్ శాస్త్రవిజ్ఞాన, సాంకేతిక స్వప్నాల సాకారంలో కొత్త శకారంభాన్ని సూచిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమ విజయం మానవాళిపై దీర్ఘకాలిక ప్రభావం చూపగలదని చెప్పారు.

ఆక్సియం-4లో వెళ్లిన అంతరిక్ష బృందంలో అనుభవజ్ఞులైన అమెరికా వ్యోమగామి, మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్, పోలాండ్ వ్యోమగామి స్లావోజ్ ఉజ్నాన్స్కీ-విస్నివ్స్కీ, హంగేరీ ప్రతినిధి టిబోర్ కాపు, భారత్ ప్రతినిధి శుక్లా ఉన్నారు. వీరి తిరుగు ప్రయాణంలో భాగంగా సోమవారం సాయంత్రం 4:45 గంటలకు ఈ అంతరిక్ష నౌక 'ఐఎస్ఎస్' నుంచి వేరుపడింది.

వీరి పునరాగమన అనంతర ప్రక్రియను వివరిస్తూ- ఈ నలుగురు వ్యోమగాములు జూలై 23 దాకా క్వారంటైన్‌లో ఉండి వైద్య, భూమిపై పరిస్థితులకు అలవాటు పడతారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. "అటుపైన 24వ తేదీ నుంచి వారు ఇస్రోతో చర్చలు ప్రారంభిస్తారు. అలాగే అంతరిక్షంలో నిర్వహించిన కార్యక్రమాలపై ఆక్సియం, నాసాతో సవివర సమీక్ష ఉంటుంది" అని ఆయన తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరించే 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) దృక్పథానికి అనుగుణంగా ప్రపంచ శాస్త్రవిజ్ఞాన సహకారంలో భారత్ నిబద్ధతను ఈ మిషన్ పునరుద్ఘాటిస్తుందని డాక్టర్ సింగ్ అన్నారు. అంతరిక్షంలో సార్వత్రిక సౌభ్రాత్ర స్ఫూర్తిని చాటిన భారత వ్యోమగామి శుక్లా ఇప్పుడు నిజమైన విశ్వబంధు-ప్రపంచ పౌరుడని ఆయన అభివర్ణించారు. "ఇది కేవలం శాస్త్రవిజ్ఞాన లక్ష్యసాధనలో భాగంగానే కాకుండా మానవాళి ఉమ్మడి పయనంలో విశ్వసనీయ భాగస్వామిగా భారత్ పాత్రను ఈ ఘనత ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు.

ఈ మిషన్ నేపథ్యంలో అవసరమైన విధివిధానాలు సహా విదేశాల్లో చర్చలు, సమీక్షలు ముగిసిన అనంతరం ఆగస్టు 17న శుక్లా మాతృభూమికి తిరిగి వస్తారని డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు.

సురక్షిత పునరాగమనం శాస్త్రవిజ్ఞాన, ప్రతీకాత్మక విజయమంటూ- "ఆకాశమే హద్దుగా భారీ స్వప్నాలను నిర్దేశించుకోవాలని ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన పిలుపు సాకారం కావడం ప్రారంభించింది. ప్రస్తుత విజయం దానికి నాంది మాత్రమే. శాస్త్రవిజ్ఞాన, అంతరిక్ష రంగంలో భవిష్యత్తును అన్వేషించుకోవడంలో నవతరం భారతీయులకు ఇది స్ఫూర్తినిస్తుంది" అని మంత్రి వ్యాఖ్యానించారు.

భవిష్యత్ గగన్‌యాన్ మిషన్‌తో సహా ప్రపంచ మానవ అంతరిక్ష యాత్రా కార్యక్రమాల్లో భారత్ పాత్ర పెరుగుతుండటాన్ని ఆక్సియం-4లో శుక్లా భాగస్వామ్యం మరింత స్పష్టంగా చాటింది. అంతరిక్ష కార్యక్రమంకన్నా శుక్లా క్షేమంగా తిరిగి రావడం భారత్‌కు మరెంతో ప్రధానాంశం. భవిష్యత్ అంతర్జాతీయ అంతరిక్ష సహకారం దిశగా ఒక విశ్వసనీయ ముందడుగుకు ఇదొక సంకేతం.

# ఆత్మనిర్భర్ భారత్: తొలి మేక్-ఇన్-ఇండియా కృత్రిమపాదం

న్యూఢిల్లీ, జులై 17:డీఆర్డీఓకి చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (డీఆర్డీఎల్), బీబీనగర్- ఎయిమ్స్ సంస్థలు దేశీయ పరిజ్ఞానంతో కృత్రిమ పాదాన్ని తయారు చేశాయి. కార్బన్ ఫైబర్ మెటీరియల్ తో కృత్రిమ కాలును అభివృద్ధి చేసిన తొలి మేక్-ఇన్-ఇండియా ఉత్పత్తి ఇదే. చౌక ధరకే అందుబాటులో ఉండే ఈ అధునాతన కార్బన్ ఫైబర్ కృత్రిమ కాలును జూలై 14న తెలంగాణ- బీబీనగర్ లోని ఎయిమ్స్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఎయిమ్స్ బీబీనగర్ - డీఆర్డీఎల్, డీఆర్డీఓ దేశీయంగా అభివృద్ధి చేసిన ఆప్టిమైజ్డ్ కార్బన్ ఫుట్ ప్రొస్థెసిస్ (ఏడీఐడీఓసి)ను...ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా సాధించిన విజయంగా- డీఆర్డీఎల్ విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి, బీబీనగర్ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంథమ్ శాంతా సింగ్ సంయుక్తంగా పరిచయం చేశారు.

125 కిలోల వరకూ బరువును సురక్షితంగా మోసే సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఏడీఐడీఓసీపై బయోమెకానికల్ తరహా పరీక్షలు నిర్వహించారు. వివిధ బరువుల్లో?. రోగులకు అనుగుణంగా ఇది మూడు శ్రేణుల్లో అందుబాటులో ఉంటుంది. అందుబాటులో ఉన్న అంతర్జాతీయ నమూనాలతో సరితూగే పనితీరు, తక్కువ ఖర్చు, అధిక సంఖ్యాక జనాభాకు అందుబాటులో, ఉత్తమ నాణ్యతతో కూడిన ఉత్పత్తిని అందించాలనే లక్ష్యంతో ఈ కృత్రిమ పాదాన్ని తయారు చేశారు.

గుమతి చేసుకుంటున్న ఈ తరహా ఉత్పత్తుల ధర సుమారు రూ. 2 లక్షలు వరకు ఉండగా, నూతన ఉత్పత్తి తయారీకి రూ. 20,000 మాత్రమే ఖర్చు అవుతుండడంతో, అవసరమైన వారికి పెద్ద మొత్తంలో డబ్బు ఆదా అయ్యే అవకాశాలు ఉన్నాయి. దాంతో, మన దేశంలోని అల్పాదాయ వర్గాల వికలాంగులకు అత్యుత్తమ నాణ్యత కలిగిన ఉత్పత్తిని సులభంగా అందించవచ్చు. అదే సమయంలో దిగుమతులపై ఆధారపడటం తగ్గడం సహా, దివ్యాంగుల మెరుగైన ఆర్థిక, సామాజిక సమ్మిళితానికి అవకాశం ఏర్పడుతుంది.

# కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా న్యూఢిల్లీలో ఇండియా పోస్ట్ బిజినెస్ మీట్ 2025-26లో గ్రామీణ స్థాయి నుండి వృద్ధి కోసం విస్తృత ప్రణాళిక ఆవిష్కరణ




న్యూఢిల్లీ, జులై 17:కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి; మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా నాయకత్వంలో పోస్టల్ శాఖ న్యూఢిల్లీలో తన వార్షిక వ్యాపార సమావేశం 2025-26ను నిర్వహించింది. ఈ వ్యూహాత్మక సమావేశం దేశవ్యాప్తంగా ఉన్న సర్కిల్ అధిపతులను (చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్స్ ను) ఒకచోట చేర్చింది, ఇండియా పోస్ట్ యొక్క వ్యాపార పరివర్తనకు మరియు ప్రీమియం లాజిస్టిక్స్, పౌర-కేంద్రీకృత సేవల ప్రదాతగా దాని అభివృద్ధి చెందుతున్న పాత్రకు రోడ్‌మ్యాప్‌పై చర్చించడానికి ఇది తోడ్పడింది.

కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా వ్యాపార సమావేశం 2025-26ను ఉద్దేశించి ప్రసంగించారు.

పోస్టల్ కార్యదర్శి శ్రీమతి వందిత కౌల్ స్వాగతోపన్యాసంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు, గత సంవత్సరంలో డిపార్ట్‌మెంట్ సాధించిన కీలక విజయాలను ఆమె వివరించారు. భవిష్యత్తు కోసం ఆవిష్కరణ, సమ్మిళితత్వం మరియు ఇండియా పోస్ట్‌ను ఆధునిక, సేవా-ఆధారిత సంస్థగా నిరంతరం అభివృద్ధి చేయడం వంటి వ్యూహాత్మక ప్రాధాన్యతలను ఆమె నొక్కి చెప్పారు.

అంతర్గత కమ్యూనికేషన్ మరియు విజ్ఞాన భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ఒక ముఖ్యమైన అడుగుగా, శ్రీ సింధియా కొత్త నెలవారీ ఇ-న్యూస్‌లెటర్ 'డాక్ సంవాద్' ను ప్రారంభించారు. ఈ ఇ-న్యూస్‌లెటర్ వేదిక ఆవిష్కరణలు, వ్యాపార అవగాహన మరియు క్షేత్రస్థాయి విజయ గాథలను వెలుగులోకి తీసుకువస్తుంది, ఇండియా పోస్ట్ ఉద్యోగుల దృఢత్వం మరియు వారు అందిస్తున్న సేవలు, పౌరుల అచంచలమైన నమ్మకం వంటి పరివర్తన కథనాలను తెలియజేస్తుంది. డాక్ సంవాద్ విశాలమైన ఇండియా పోస్ట్ నెట్‌వర్క్‌లోని వాటాదారులను ప్రేరేపించడం, విద్యావంతులను చేయడం మరియు కనెక్ట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.

కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా ఉ పోస్టల్ కార్యదర్శి శ్రీమతి వందిత కౌల్ నెలవారీ ఇ-న్యూస్‌లెటర్‌ను ప్రారంభించారు.

ఈ సమావేశంలో, అన్ని సర్కిల్ అధిపతులు (చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్స్) తమ వ్యాపార పనితీరు, ప్రాంతీయ కార్యక్రమాలు, సవాళ్లు మరియు వృద్ధిని వేగవంతం చేయడానికి వ్యూహాలను సమర్పించారు. ఈ సమర్పణలు జాతీయ ప్రాధాన్యతలతో సమలేఖనం చేయడానికి మరియు లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఇ-కామర్స్ మరియు ప్రజా సేవల డెలివరీలో ఇండియా పోస్ట్ సామర్థ్యాలను పెంచడానికి జరుగుతున్న శక్తివంతమైన, గ్రామీణ స్థాయి ప్రయత్నాలను నొక్కి చెప్పాయి.

శ్రీ సింధియా ప్రతి ప్రాంతం యొక్క అభివృద్ధి, అడ్డంకులు మరియు ఆశయాలను శ్రద్ధగా వింటూ ప్రతినిధులతో లోతుగా సంభాషించారు. తన ప్రసంగంలో, గ్రామీణ-పట్టణ అంతరాన్ని తగ్గించడంలో మరియు బలమైన లాజిస్టిక్స్, ఆర్థిక సమ్మిళితత్వం మరియు డిజిటల్ కనెక్టివిటీ ద్వారా సమ్మిళిత వృద్ధిని బలోపేతం చేయడంలో ఇండియా పోస్ట్ కీలక పాత్రను ఆయన పునరుద్ఘాటించారు.

"ఇండియా పోస్ట్ కేవలం ఒక సేవ కాదు, మన దేశంలోని మారుమూల ప్రాంతాలను కలుపుతున్న ఒక జీవనరేఖ. దేశంలోని ప్రతి మూల నుండి శక్తి, నిబద్ధత మరియు ఆలోచనలను చూసి గర్విస్తున్నాను," అని శ్రీ సింధియా అన్నారు.

సంస్థ యొక్క పురోగతిని ప్రశంసిస్తూ, పనితీరు కొలమానాలు, ఆవిష్కరణలు మరియు జవాబుదారీతనాన్ని పెంపొందించే కార్పొరేట్-శైలి నిర్మాణాన్ని అవలంబించినందుకు ఇండియా పోస్ట్‌ను మంత్రి అభినందించారు. తన ప్రజా సేవా బాధ్యతను నిలబెట్టుకుంటూ లాజిస్టిక్స్ మరియు ఆర్థిక సేవల్లో ఇండియా పోస్ట్ తీవ్రంగా పోటీ పడేలా వృత్తిపరమైన, సేవా-ఆధారిత సంస్కృతిని పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

అంతేకాకుండా, గౌరవనీయులైన మంత్రవర్యులు వివిధ సర్కిల్‌లకు వారి నిర్దిష్ట విభాగాలలో సామర్థ్యానికి అనుగుణంగా 20% నుండి 30% వరకు ఆశాజనకమైన వృద్ధి లక్ష్యాన్ని ఈజ 2025-26 సంవత్సరమునకు నిర్దేశించారు. ఈ లక్ష్యం, సామాజిక బాధ్యతకు ఎటువంటి రాజీ పడకుండా, భారత ప్రభుత్వానికి స్థిరమైన లాభ కేంద్రంగా ఇండియా పోస్ట్‌ను మార్చాలనే విస్తృత లక్ష్యంలో భాగమని వారు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రక్రియల సరళీకరణ, సామర్థ్య పెంపుదల మరియు డిజిటల్ సాధికారతపై కూడా దృష్టి సారించాలి అని చర్చించారు, ఇవన్నీ ఇండియా పోస్ట్‌ను భవిష్యత్‌కు సిద్ధంగా, చివరి (శ్రీజీబబి) మైలు లాజిస్టిక్స్ మరియు సేవా కేంద్రంగా నిలపడానికి అవసరమైన అంశాలు.

వార్షిక వ్యాపార సమావేశం, సంస్థ అంతటా వ్యాపార వృద్ధిని వేగవంతం చేయడానికి, సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి మరియు సేవ, ఆవిష్కరణ మరియు శ్రేష్ఠత సంస్కృతిని పెంపొందించడానికి బలమైన సామూహిక సంకల్పంతో ముగిసింది.

# చరిత్రాత్మక అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు స్వాగతం పలికిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 17:అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చరిత్రాత్మక యాత్ర చేపట్టి, భూమికి తిరిగివచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆత్మీయ స్వాగతం పలికారు. ఐఎస్ఎస్ చేరుకున్న తొలి భారతీయ వ్యోమగామిగా కెప్టెన్ శుక్లా సాధించిన విజయం అసాధారణమైందని, దేశ అంతరిక్ష ప్రయాణంలో ఇదొక కీలక ఘట్టమని ప్రశంసించారు.

"చరిత్రాత్మక అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా ముగించుకుని భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను దేశ వాసులందరితో పాటు స్వాగతిస్తున్నాను. అంకిత భావం, సాహసం, స్ఫూర్తి పెట్టుబడిగా ఐఎస్ఎస్ చేరుకున్న తొలి భారతీయ వ్యోమ గామిగా కెప్టెన్ శుక్లా సాధించిన విజ యం కోటి కలలకు ఊపిరి పోస్తోంది. మన మానవ-సహిత గగన్ యాన్ మిషన్ ప్రయాణంలో ఇదొక కీలక మైలురాయిగా నిలుస్తుంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. కొండా సురేఖ



సిద్దిపేట, జులై 17: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేటలోని సురభి వైద్య కళాశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఐదు మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. రోజురోజుకు పర్యావరణం కలుషితం అవుతుందని, మొక్కల పెంపకం ద్వారానే నియంత్రించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల చైర్మన్ సురభి హరేందర్రావు, సెక్రటరీ సురభి మహేందర్ రావుతో పాటు వైద్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రత్యక్ష నగదు బదిలీ వంటి ప్రయోజనాలు పొందటం సులభం

న్యూఢిల్లీ, జులై 17:ఏడేళ్ళు వచ్చినా బయోమెట్రిక్స్ సమాచారాన్ని పూర్తిగా ఇవ్వని పిల్లల విషయంలో ఈ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) తెలియజేసింది.

ప్రస్తుత ఆధార్ వ్యవస్థలో ఈ పని చేయడం తప్పనిసరి అనీ, సమీపంలోని ఆధార్ సేవా కేంద్రం లేదా నియమిత కేంద్రాల్లో పూర్వపు సమాచారాన్ని పూర్తిగా నవీకరించాలని సూచించింది.

అయిదేళ్ళ లోపు చిన్నారుల ఫోటో, పేరు, పుట్టినతేదీ, చిరునామా వంటి వివరాలు... అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించినప్పుడు వారి పేరుని ఆధార్ లో నమోదు చేసుకుంటారు. అయితే చిన్నారుల వయసు రీత్యా వేలిముద్రలు, కంటిపాప (ఐరిస్) బయోమెట్రిక్స్ ను సేకరించరు. ప్రస్తుతం ఉన్న నియమ నిబంధనల ప్రకారం పిల్లలకు అయిదేళ్ళు వచ్చేసరికి వారి వేలిముద్రలు, కంటిపాప బయోమెట్రిక్స్ ను విధిగా ఆధార్ లో నమోదు చేయవలసి ఉంటుంది.

ఈ ప్రక్రియను తొలి 'మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్' (ఎంయూబీ)గా వ్యవహరిస్తారు. అయిదు నుంచి ఏడేళ్ళ లోపు పిల్లల వివరాల నవీకరణ ఉచితం కాగా, ఏడేళ్ళ పైబడ్డ పిల్లల ఆధార్ వివరాల నవీకరణకు నామమాత్రపు రుసుం (రూ. 100) చెల్లించాల్సి ఉంటుంది.

చిన్నారుల బయోమెట్రిక్ వివరాలు కచ్చితత్వం, విశ్వసనీయత కలిగి ఉండాలంటే, ఎంబీయూను తక్షణమే పూర్తి చేయడం అవసరమని, పిల్లలకు ఏడేళ్ళు వచ్చిన తరువాత కూడా వివరాల నవీకరణ జరగకపోతే, ప్రస్తుత నిబంధనలను అనుసరించి, వారి ఆధార్ గుర్తింపు రద్దయ్యే అవకాశం ఉందని ఉడాయ్ స్పష్టం చేసింది.

నమోదు నుంచి అవకాశాలను అందించడం వరకు-ఆధార్ ద్వారా ప్రతి అడుగులో సాధికార కల్పన

నవీకరించిన బయోమెట్రిక్ తో కూడిన ఆధార్ వివరాలు జీవన సౌలభ్యాన్ని మెరుగుపరిచి, పాఠశాలల్లో అడ్మిషన్లు, ప్రవేశ పరీక్షలకు నమోదు, అర్హతను బట్టి ఉపకార వేతనాలు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి పథకాల ప్రయోజనాలు వంటి అనేక సౌలభ్యాలను అందిస్తుంది.

# స్కిల్ ఇండియా మిషన్‌తో యువతను నైపుణ్యం కలిగిన, స్వయంసమృద్ధ శక్తిగా తయారు చేయాలన్నదే ప్రభుత్వ అచంచల నిబద్ధత: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 17:'స్కిల్ ఇండియా మిషన్'ను ప్రారంభించి పది సంవత్సరాలైన సందర్భంగా... ఈ కార్యక్రమంతో దేశ యువతను నైపుణ్యం కలిగిన, స్వయంసమృద్ధ శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అచంచలమైన నిబద్ధతతో ఉందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మంగళవారం పునరుద్ఘాటించారు. మార్పు తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమమే 'స్కిల్ ఇండియా మిషన్'... ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా లక్షలాది యువతీయువకులకు సాధికారతను కల్పిస్తోందని ప్రధాన మంత్రి తెలిపారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో కేంద్ర మంత్రి శ్రీ జయంత్ సింగ్‌తో పాటు మైగవ్ఇండియా పోస్టులకు ప్రధానమంత్రి స్పందించారు.

"మన యువతను నైపుణ్యాలను అందించేందుకు, స్వయంసమృద్ధంగా తీర్చిదిద్దేందుకు 'స్కిల్ ఇండియా' కార్యక్రమం పునరంకితం అవుతోంది"

"యువతను నిపుణులుగా తయారుచేయడం, కొత్త అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారులుగా తయారు చేయడంలో- స్కిల్ ఇండియా- లెక్కకు అందనంత మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దింది. రాబోయే కాలంలో కూడా మన దేశ యువతీ యువకులకు ప్రపంచ స్థాయి అత్యుత్తమ పద్ధతులకు దీటుగా సరికొత్త నైపుణ్యాలను అందించడంపైనే దృష్టి సారించాం. తద్వారా... మనం 'వికసిత్ భారత్' కలను నిజం చేసుకుంటాం"

ఆహ్వానము
తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు రచన
సృష్టికర్త శతకము




ఆవిష్కరణ మహోత్సవము

తేది: 27 జూలై 2025 ఆదివారం సాయంత్రం గం.6లకు
వేదిక: రామ్మోహన్ గ్రంథాలయం, బందర్ రోడ్, బందరు లాకులు దగ్గర, విజయవాడ

సభాధ్యక్షులు: డా॥ జి.వి.పూర్ణచంద్, శతాధిక గ్రంథకర్త
పుస్తక ఆవిష్కర్త: శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్, అధ్యక్షులు, సరసభారతి
గ్రంథసమీక్ష: డా॥ గుమ్మా సాంబశివరావు, ప్రముఖ రచయిత, సాహితీవిమర్శకులు

ఈ సభకు మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.

- చలపాక ప్రకాష్ వ్యవస్థాపక కార్యదర్శి
రమ్యభారతి సాహిత్య వేదిక

# జలాలతోనే రాయలసీమకు సిరి : చంద్రబాబు




అమరావతి, జులై 17: జలాలతోనే రాయలసీమకు సిరి అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. నందికొట్కూరు మండల పరిధిలోని మల్యాల వద్ద గురువారం హంద్రీనీవా కు నీటి విడుదల అనంతరం అల్లూరు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాటాడుతూ ఒక్క సారి అధికారమిస్తే.. ఐదేళ్లపాటు రోడ్లన్నీ గుంతలు కొట్టారు. వాళ్లు చేసిన గుంతలను నేటి వరకు పూడ్చి వేశామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చేస్తాం.. సంక్షేమం అందిస్తాం.. అని ప్రకటించిన మేరకు మాటను నిలబెట్టుకున్నామన్నారు.

పెన్షన్ పెంచడానికి గత వైసీపీ ప్రభుత్వంకు మనసు రాలేదన్నారు. ఐదేళ్లు సమయం తీసుకున్నారు. పేద కుటుంబాలకు పెద్ద కొడుకుగా ఉంటున్నా.. పెన్షన్లను ఒకేసారి నాలుగు వేల రూపాయలకు పెంచాం. దివ్యాంగులకు ఆరు రెట్ల మేర పెన్షన్ పెంచాం, రూ.33వేల కోట్లకు పైగా పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే అన్న విషయం గుర్తు చేశారు.

తల్లికి వందనం చెప్పినట్టు అందరికీ ఇస్తున్నాం.. ఇదీ మా విశ్వసనీయత మారుపేరుగా సీఎం పేర్కొన్నారు. పేదలకు తిండి పెట్టడం నేరమా.. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసేసింది. కానీ కూటమి ప్రభుత్వం రాగానే అన్న క్యాంటీన్లను తెరిపించాం.. పేదవారికి కడుపు నిండా అన్నం పెడుతున్నామన్నారు. పేదలకు సంక్షేమం అందించడాన్ని గొప్పగా భావించడం లేదు.. ఓ బాధ్యతగా తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

శ్రీశైలం మల్లన్న దగ్గర ప్రారంభమయ్యే నీళ్లు.. తిరుమల వెంకన్న వరకు తీసుకెళ్లవచ్చు అన్నారు. దేవుళ్లను కూడా అనుసంధానం చేసి.. జలహారతి ఇద్దాం.. ఈ రకమైన ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేసుకోగలిగితే.. రైతుల కష్టాలు శాశ్వతంగా తొలగిపోతాయన్నారు. ఢిల్లీ లో రెండు రాష్ట్రాల మధ్య నీటి సమస్యలపై చర్చ జరిగింది. ఒక్కొక్కసారి కొన్ని ఇబ్బందులు ఉంటాయి.. రాజకీయాలు ఉంటాయి.. కానీ వీటిని అధిగమించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. నన్ను తిట్లు తిట్టినా.. శాపనార్థాలు పెట్టినా.. నేను మనస్సుకు తీసుకోను.. వెనకడుగు వేయను. క్లైమోర్ మైన్లే నన్నేమీ చేయలేకపోయాయి.. ఈ విమర్శలు నన్నేం చేయగలవని చంద్రబాబు పేర్కొన్నారు.

పరిశ్రమను స్థాపించాలంటే నీటి సౌకర్యం కావాలని కియా వాళ్లు అడిగారు. పెనుగొండ సమీపంలో గొల్లపల్లి రిజర్వాయర్ ను 8 నెలల్లో పూర్తి చేసి.. కియా పరిశ్రమ వచ్చేలా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. హంద్రీనీవా ద్వారా 6 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు.. 33లక్షల మందికి తాగు నీరు ఇస్తున్నాం. రాయలసీమ ప్రజల చిరకాల కలను నెరవేర్చామన్నారు. 2019లో ఓ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఒక్క ఛాన్స్ అన్నారు.. ప్రజలూ ఏమారారు.. చంద్రబాబు బాగానే చేస్తున్నారు.. కానీ ఓసారి ఛాన్స్ ఇచ్చి చూద్దామని అనుకున్నారు. కానీ ఒక్క ఛాన్స్ ఇస్తే.. ఐదేళ్ల పాటు.. బాదుడే బాదుడు.. నరుకుడే నరుకుడే అన్న ధోరణిలో వ్యవహరించారన్నారు.

రాయలసీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టిన పార్టీ టీడీపీ పార్టీ అన్నారు. వైసీపీ ఐదేళ్లు అధికారంలో ఉండి కనీసం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. రాయలసీమ అంటూ సెంటిమెంట్ ను వైసీపీ రెచ్చగొడుతుంది.. కులాల మధ్య చిచ్చు పెడుతుంది. మాటలు చెప్పడం ఈజీ.. కానీ పనిచేయడం చాలా కష్టమన్నారు. హంద్రీ-నీవాపై వైసీపీ ఒక్క రూపాయి అయినా ఖర్చు పెట్టిందా.. అని ప్రశ్నించారు. కుప్పంలో పెద్ద డ్రామా వేశారు. కాల్వల్లో నీళ్లు లేవు.. ట్యాంకర్లతో నీళ్లు తెచ్చారు.. డమ్మి గేట్లు పెట్టి.. నీళ్లిచ్చామన్నారు. అలాంటి డ్రామాలు ప్రజలకు అవసరమా.. అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసింది టీడీపీ.. ప్రాజెక్టులను చెడగొట్టింది వైసీపీ అన్నారు.

పిల్లలకు పాఠాలు చెప్పే టీచర్లు లేకుండా పాఠశాలలు నడిపారు. కానీ తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టామన్నారు. రాష్ట్రంలో 16వేల మందికి పైగా టీచర్లను రిక్రూట్ చేసుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. కోటి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచిని చెబుతున్నాం.. ఆశీర్వదించమని కోరుతున్నామన్నారు. చిత్తూరులో మామిడి ధరలు పడిపోయాయి.. కిలోకు రూ.4 అందించి ఆ రైతులను ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. పొగాకు ధర పడిపోతే.. ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. కేంద్రం రైతులకు పీఎం కిసాన్ డబ్బులు వేయగానే.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ డబ్బులు వేస్తుందన్నారు.. మూడు విడతల్లో అన్నదాత సుఖీభవ డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తామన్నారు. నిరుద్యోగ భృతిని ఇస్తాం.. కుటుంబాలకు భారం కానివ్వమన్నారు. ఉపాధి కల్పిస్తాం.. ఉద్యోగాలు వచ్చేలా బాధ్యత తాము తీసుకుంటామన్నారు. 700కు పైగా ప్రభుత్వ సర్వీసులను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

గతంలో తాను మాత్రమే పరుగులు పెట్టేవాడిని.. ఇప్పుడు తనతో పాటు ప్రజా ప్రతినిధులను.. అధికారులను కూడా పరుగులు పెట్టిస్తానన్నారు. ప్రభుత్వం మామిడి రైతులకు అండగా నిలుస్తుంటే.. చిత్తూరు వెళ్లి రోడ్ల మీద మామిడి కాయలు పోసి దుర్మార్గం చేశారు.. కుట్రలు పన్నారు. వివేకా మరణాన్ని గుండెపోటు అన్నారు.. ఆ తర్వాత గొడ్డలి పోటు అని తేలిన విషయాని గుర్తు చేశారు. ఆ హత్య నెపాన్ని నాపైనే నెట్టారు. వాళ్లు చేసిన నేరాన్ని ఓ ముఖ్యమంత్రి పైనే నెట్టగలిగారంటే.. సామాన్యులు ఓ లెక్కా అన్నారు. వివేకా హత్య కేసులో అరెస్ట్ కాకుండా ఉండేందుకు కర్నూల్లోనే ఉండి గుండెపోటు డ్రామా ఆడారన్నారు.

ఇకపై నన్ను మోసం చేయలేరు.. తోక జాడిస్తే.. కత్తిరిస్తా

రాయలసీమలో ముఠా కక్షలను నేనే తుదముట్టించాను.. సొంత పార్టీ వారినైనా నేను వదిలి పెట్టలేదన్నారు. సీమలో ముఠాలు లేకుంటే.. ఈ ప్రాంతం దేశంలో అద్భుతమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. నక్సలిజం వద్దని చెబితే.. నన్ను అంతమొందించేందుకు క్లైమోర్ మైన్లు పెట్టారు. ఓ పార్టీకి రాయలసీమ అంటే రాజకీయం. నాకు రాయలసీమ అంటే నీళ్లు అభివృద్ధి వంటివి అన్న విషయం ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

## 2026-పద్మ అవార్డుల నామినేషన్లకు చివరి తేదీ 2025 జూలై 31

న్యూఢిల్లీ, జులై 17:2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించబోయే 2026-పద్మ అవార్డులకు సంబంధించి నామినేషన్లు, సిఫార్సులు 2025 మార్చి 15న ప్రారంభమయ్యాయి. పద్మ అవార్డుల నామినేషన్లకు చివరి తేదీ 2025 జూలై 31. నామినేషన్లు/సిఫార్సులను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తారు.

పద్మ అవార్డులు, అనగా... పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీలు దేశ అత్యున్నత పౌర పురస్కారాల కోవకు చెందినవి. శ్రేష్ఠతను గుర్తించాలన్న ఉద్దేశంతో 1954లో ప్రారంభించిన ఈ అవార్డులను ప్రతి ఏటా రిపబ్లిక్ డే సందర్భంగా ప్రకటిస్తారు. కళ, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, విజ్ఞానం, ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పరిశ్రమలు తదితర రంగాల్లో చేసిన 'విశిష్ట కృషి లేదా సేవ'కు గుర్తింపుగా వీటిని అందిస్తారు. జాతి, వృత్తి, స్థాయి, లింగ భేదం ఊసు లేకుండా ప్రతి ఒక్కరూ ఈ అవార్డులకు అర్హులే. కాగా, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగసంస్థల్లో పనిచేసే వారు (డాక్టర్లు, సైంటిస్టులు మినహా) ఈ అవార్డులకు అర్హులు కాదు.

పద్మ అవార్డులను "ప్రజల పద్మా"లుగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది... ప్రజలందరూ స్వీయ నామినేషన్లు సహా నామినేషన్లు, సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేస్తోంది. మహిళలు, బలహీన వర్గాలు, ఎస్సీలు, ఎస్టీలు, దివ్యాంగులు, సమాజ సంక్షేమం కోసం నిస్వార్థంగా సేవ చేస్తున్న ప్రతిభావంతులను గుర్తించేందుకు సమష్టి కృషి చేయవలసిందిగా కోరుతోంది.

నామినేషన్లు, సిఫార్సులు అవసరమైన అన్ని వివరాలతో, పద్మ పోర్టల్ లో సూచించిన విధానాన్ని అనుసరించి సమర్పించవలసి ఉంటుంది. నామినేట్ చేస్తున్న వ్యక్తి ఎంచుకున్న రంగంలో చేస్తున్న, లేదా చేసిన విశేష కృషి, సాధించిన విజయాలు, చూపిన ప్రభావాన్ని ప్రతిబింబించే విధంగా 800 పదాల లోపు చిరు వ్యాసాన్ని కూడా సమర్పించాలి.

# హెచ్‌సీఏలో స్కామ్.. ఉప్పల్ సీఐ సస్పెన్షన్..

హైదరాబాద్, జులై 17:ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి పై సస్పెన్షన్ వేటు పడింది. తనకు సంబంధం లేని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహారంలో తలదూర్చడంతో ఎలక్షన్ రెడ్డిపై వేటు వేశారు అధికారులు. కాగా, హైదరాబాద్ క్రికెట్ అసోషియేషన్‌లో భారీగా నిధుల అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై హెచ్?సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు తో పాటు హెచ్‌సీఏ సెక్రటరీ దేవరాజ్ , ట్రెజరర్ జగన్నాథ్ శ్రీనివాస్ రావు , సీఈవో సునీల్ కుమార్ , శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రెటరీ రాజేందర్ యాదవ్, రాజేందర్ యాదవ్ భార్య కవిత మొత్తం ఆరుగురిపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ2గా ఉన్న దేవరాజ్?ను తప్ప మిగిలిన అధికారులను సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. దేవరాజ్ మాత్రం పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నారు. దేవరాజ్ పరార్ కావడానికి ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డే కారణమని అధికారులు గుర్తించారు. దేవరాజ్ అరెస్ట్?కు సీఐడీ రంగం సిద్ధం చేయగా.. అరెస్ట్ సమాచారాన్ని ముందుగానే దేవరాజ్?కు చేరవేశాడు ఎలక్షన్ రెడ్డి. దీంతో దేవరాజ్ సీఐడీకి చిక్కలేదు. సీఐడీ సమాచారాన్ని ముందుగా లీక్ చేసినందుకు సీఐ ఎలక్షన్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు అధికారులు.

# హంతకులను తక్షణమే అరెస్టు చేయాలి : బక్కి వెంకటయ్య



మెదక్, జులై 17: దళిత నాయకుడు మరెల్లి అనిల్ ను హత్యచేసిన హంతకులను తక్షణమే అరెస్టు చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీసులను ఆదేశించారు. కుల్చారం మండలం పైతరకు చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మరెల్లి అనిల్ కుటుంబాన్ని గురువారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించి హత్య వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న దళిత నాయకుడు అనిల్ ను కాల్చి చంపడం తగదన్నారు. నిందితులు ఎంతటి వారైనా వదలొద్దని పోలీసులకు సూచించారు. అనిల్ హత్య కేసును ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు గా మార్చాలని పోలీసులను అదేశించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మకొండ దయాసాగర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పుర్ర ప్రభాకర్, జాతీయ మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ మహిళ మృతి.. ఆస్పత్రిని ధ్వంసం చేసిన బంధువులు



అమరావతి, జులై 17:నగరంలోని శ్రీ చక్ర హాస్పిటల్ వద్ద గురువారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. కల్లూరు కు చెందిన వనిత జ్వరం వచ్చిందని శ్రీచక్ర హాస్పిటల్ లో చేరారు. అయితే శ్రీ చక్ర హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కూతురు చనిపోయిందని హాస్పిటల్ ముందు వనిత తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. యాజమాన్యం, అక్కడి వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మృతురాలి కుటుంబం, బంధువులు హాస్పిటల్ అద్దాలు ధ్వంసం చేశారు.

దీంతో శ్రీ చక్ర హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకోవడంతో భారీగా పోలీసులను మోహరించారు. మృతరాలి కుటుంబ, బంధువులకు సర్ది చెప్పేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు. అయితే ఫలితం లేకపోయింది. తమ కూతురు ప్రాణాలు తీసిన శ్రీ చక్ర హాస్పిటల్ పై చర్యలు తీసుకొని మరొకరి ప్రాణలు పోకుండా చూడాలంటూ మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు.

డబ్బు కోసం జలగలా పీడించడం తప్ప.. తమ కూతురి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు ఏమాత్రం ప్రయత్నం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా దాదాపు 4గంటల సేపు హాస్పిటల్ ముందు మృతదేహంతో బంధువులు ఆందోళన చేపట్టారు. ఎంత చెప్పినా వినకపోవడంతో మృతురాలు బంధువులను పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో హాస్పిటల్ యాజమాన్యంపై కర్నూల్ నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రతిష్టాత్మక స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 పురస్కారాలను ప్రదానం చేసిన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, జులై 17:గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎమ్ఓహెచ్‌యూఏ) ఈనెల 17న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే జాతీయ కార్యక్రమంలో ప్రతిష్టాత్మక స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 పురస్కారాలను భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్, సహాయమంత్రి శ్రీ టోకన్ సాహు పాల్గొంటారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 ప్రపంచంలోనే అతిపెద్ద పట్టణ పరిశుభ్రత సర్వే 9వ ఎడిషన్. ఈ చారిత్రక కార్యక్రమం స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ (ఎస్‌బీఎమ్-యూ)ను ముందుకు నడిపిస్తున్న నగరాల అవిశ్రాంత కృషిని గుర్తిస్తూ.. దేశంలోని పరిశుభ్రమైన నగరాలను ఎంపిక చేస్తుంది. ఈ సంవత్సరం ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ఎ) సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాలు బి) 5 జనాభా వర్గాల నుంచి టాప్ 3 పరిశుభ్ర నగరాలు సి) ప్రత్యేక వర్గం: గంగా పట్టణాలు, కంటోన్మెంట్ బోర్డులు, సఫాయిమిత్ర సురక్ష, మహాకుంభ్ డి) రాష్ట్ర స్థాయి పురస్కారాలు - రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతాల్లోని అత్యంత పరిశుభ్రమైన నగరాలు అనే 4 విభాగాల్లో ప్రదానం చేస్తారు. మొత్తం 78 పురస్కారాలను అందించనున్నారు.

ఎస్‌బీఎమ్-యూ కింద చారిత్రక కార్యక్రమంగా స్వచ్ఛ సర్వేక్షణ్ (ఎస్ఎస్) గత తొమ్మిది సంవత్సరాలుగా దేశంలోని పట్టణాలను పరిశుభ్రత దిశగా నడిపించే శక్తిగా మారింది. ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడం, వారి అభిప్రాయాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం, స్ఫూర్తిదాయకమైన చర్యల కోసం ఈ సర్వే నిర్వహిస్తున్నారు. 2016లో 73 యూఎల్‌బీలతో ప్రారంభమవగా.. ఈ సర్వే తాజా ఎడిషన్ 4,500 లకు పైగా నగరాలను కలిగి ఉంది. ఈ సంవత్సరం అగ్రశ్రేణి స్వచ్ఛ నగరాలకు మాత్రమే కాకుండా.. భవిష్యత్తులో విజయం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న, గణనీయ పురోగతి సాధిస్తున్న చిన్న నగరాలకూ పురస్కారాలు అందించి ప్రోత్సహించనున్నారు.

తగ్గించడం, మళ్లీ ఉపయోగించడం, రీసైకిల్ చేయడం స్ఫూర్తితో ఎస్ఎస్ 2024-25 పురస్కారాలను అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి వార్డులో 3,000 మందికి పైగా మదింపుదారులు 45 రోజుల పాటు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సమగ్రత, పారదర్శకత పట్ల అచంచలమైన నిబద్ధతతో ఈ సర్వే 11 లక్షలకు పైగా కుటుంబాల అభిప్రాయాలను సేకరించింది. ఇది జాతీయ స్థాయిలో పట్టణ జీవన విధానం, పారిశుధ్యాన్ని అర్థం చేసుకోగల సమగ్రమైన, దార్శనిక విధానాన్ని ప్రతిబింబించింది.

2024లో నిర్వహించిన ఈ సర్వే ప్రజాభిప్రాయ సేకరణలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. ముఖాముఖి సంభాషణలు, స్వచ్ఛతా యాప్, ఓఎఉనీల, సోషల్ మీడియా వేదికల ద్వారా 14 కోట్ల మంది పౌరుల నుంచి విజయవంతంగా అభిప్రాయాలను సేకరించి వారిని ఈ సర్వేలో భాగస్వాములుగా చేసింది.

పట్టణ పరిశుభ్రతను, ప్రజలకు సేవలందుతున్న తీరును అంచనా వేయడం కోసం స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 ఒక స్మార్ట్, నిర్మాణాత్మక విధానాన్ని అనుసరించింది. 54 సూచికలు.. 10 ప్రాధాన్య అంశాలతో నగరాల్లో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ గురించి పూర్తి అవగాహనను ఇది అందిస్తుంది.

ఎస్ఎస్ 2024-25 చాలా ప్రత్యేకమైన లీగ్.. ఇది సూపర్ స్వచ్ఛ లీగ్ (ఎస్ఎస్ఎల్). పరిశుభ్రతలో రాణిస్తున్న నగరాల ప్రత్యేక లీగ్. ఎస్ఎస్ఎల్ రెండు ప్రయోజనాలను అందిస్తుంది. ఇది అత్యుత్తమ పనితీరు కనబరిచిన నగరాలు పరిశుభ్రతలో మరింత ఉన్నత ప్రమాణాలను చేరుకోవడానికి ప్రేరేపిస్తుంది. అలాగే ఇతర నగరాలు తమ పనితీరును మరింత మెరుగుపరచుకుని అగ్రస్థానం కోసం పోటీపడేలా ప్రోత్సహిస్తుంది. గత మూడేళ్లలో కనీసం ఒక్కసారైనా తొలి మూడు స్థానాల్లో నిలిచిన నగరాలు.. ప్రస్తుత సంవత్సరం సంబంధిత జనాభా కేటగిరీలో టాప్ 20 శాతంలో నిలిచిన నగరాలు ఎస్ఎస్ఎల్‌లో భాగంగా ఉంటాయి.

తొలిసారిగా దేశంలోని నగరాలను జనాభా ఆధారంగా ఐదు వర్గాలుగా వర్గీకరించారు. అవి (1) చాలా చిన్న నగరాలు: 20,000 కన్నా తక్కువ జనాభా గలవి, (2) చిన్న నగరాలు: 20,000 నుంచి 50,000 జనాభా గలవి, (3) మధ్యస్థ నగరాలు: 50,000 నుంచి 3 లక్షల జనాభా గలవి, (4) పెద్ద నగరాలు: 3 నుంచి 10 లక్షల జనాభా గలవి, (5) మిలియన్-ప్లస్ నగరాలు: 10 లక్షల కన్నా ఎక్కువ జనాభా గలవి. ప్రతి కేటగిరీని దాని పరిమాణం, ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన పారామితులను ఉపయోగించి మూల్యాంకనం చేశారు. ప్రతి కేటగిరీ నుంచి అత్యంత పరిశుభ్రమైన నగరాలను గుర్తించి పురస్కారాలను అందిస్తారు. చిన్న నగరాలు కూడా అగ్రస్థానంలో ఉన్న ప్రధాన నగరాలతో సమానంగా పోటీ పడే అవకాశాన్ని ఈ విధానం అందిస్తుంది.

## విజయవాడ నారాయణ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య

అమరావతి, జులై 17:విజయవాడ భవానిపురంలోని నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి జీవన్‌సాయి ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకోవడం తీవ్ర విషాదానికి దారితీసింది.

జీవన్‌సాయి ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విద్యార్థులపై అకడమిక్ ప్రెషర్, అధిక ర్యాంకుల కోసం పోటీ, వ్యక్తిగత సమస్యలు వంటి కారణాలు ఇలాంటి ఘటనలకు దారితీసే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తుండగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడుతున్న కొద్దీ పూర్తి సమాచారం అందిస్తామని అధికారులు తెలిపారు.

భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ప్రభుత్వం
సౌజన్యంతో
అమరవాది ఫౌండేషన్
సాహిత్య, సాంస్కృతిక, బాల వికాస సంస్థ, హైదరాబాద్
శ్రీమతి అమరవాది హైమవతీ-డా. ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్ సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : శ్రీమతి శీలా సుభద్రాదేవి
డా. ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్-శ్రీమతి హైమవతి బాల సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : డా. అమ్మిన శ్రీనివాస రాజు
డా. అమరవాది నీరజ అంజు బాలల బొమ్మల కథా పుస్తకం | డా. పత్తిపాక మోహన్ తెలుగు బాల గీతాల హిందీ అనువాదం హరే బరే గీత్ అను: డా. షేక్ అబ్దుల్ ఘనీ | శ్రీ గరిపెల్లి అశోక్ గోటీలాట బాలల కథా సంపుటి
పుస్తకాల ఆవిష్కరణ - బాలల కథల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం
27 జూన్, 2025 ఆదివారం, మధ్యాహ్నం గం. 2.30 నుండి 4.30 వరకు
సమావేశ మందిరం, మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్
సభాధ్యక్షులు
డా. పత్తిపాక మోహన్
దక్షిణ ప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, విద్యా మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం
ముఖ్య అతిథి
ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
పూర్వాధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం & అఖిల భారత, జా.సా.ప.
జ్యోతి ప్రకాశనం
శ్రీమతి మాడభూషి లలితా దేవి
అధ్యక్షులు, డా. మాడభూషి రంగాచార్య స్మారక సమితి
అమరవాది ఫౌండేషన్ పక్షాన
డా. అమరవాది నీరజ అధ్యక్షులు | ఎ. సీతారాం ఉపాధ్యక్షులు | చింతకింది మాల్యా ప్రధాన కార్యదర్శి | డా. హారిక చెరుకుపల్లి నిర్వాహక కార్యదర్శి

# ఏవీజీసీ-ఎక్స్ఆర్‌లో అత్యాధునిక కోర్సులను ప్రకటించిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్: 2025, ఆగస్టులో మొదటి బ్యాచ్ ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 17:ఈ ఆగస్టులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ (ఐఐసిటీ) మొదటి బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించనున్న నేపథ్యంలో భారత్‌లో అభివృద్ధి చెందుతున్న డిజిటల్, క్రియేటివ్ ఆర్థిక వ్యవస్థ పరివర్తన చెందడానికి సిద్ధమవుతోంది. ఏవీజీసీ-ఎక్స్ఆర్ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాల్టీ) రంగంలో పరిశ్రమ అవసరాలకు తగిన కోర్సులకు సంబంధించిన విస్తృతమైన పోర్ట్‌ఫోలియోను ఈ సంస్థ అందిస్తుంది.

2025, మేలో జరిగిన వరల్డ్ ఆడియో, విజువల్ ఎంటర్ టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్)లో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పరిశ్రమ దిగ్గజాల తోడ్పాటు ఉంది. గేమింగ్‌లో ఆరు ప్రత్యేక కోర్సులు, పోస్ట్ ప్రొడక్షన్లో నాలుగు, యానిమేషన్, కామిక్స్, ఎక్స్ఆర్‌లో ఎనిమిది కోర్సులను ఈ సంస్థ అందిస్తోంది. అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక సాంకేతిక రంగంలో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు పరిశ్రమలో అగ్రశ్రేణి నిపుణుల సహకారంతో వీటిని నిశితంగా రూపొందించారు.

బ్రిటన్ లోని యొర్క్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందంపై ఐఐసీటీ ఇటీవలే సంతకం చేసింది. ఇది సహకారాత్మక పరిశోధన, అధ్యాపకులను పరస్పరం మార్చుకోవడం, అంతర్జాతీయ సర్టిఫికేషన్లకు మార్గాన్ని సుగమం చేస్తుంది.

దాని బలమైన పునాదికి తోడుగా.. అంతర్జాతీయంగా అగ్రశ్రేణి సంస్థలైన గూగుల్, యూట్యూబ్, అడోబ్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్‌వీఐడీఐఏ, జియోస్టార్ లాంటి సంస్థలు ఐఐసీటీతో సుదీర్ఘ భాగస్వామ్యానికి కట్టుబడి ఉన్నాయి. పాఠ్యాంశాల అభివృద్ధి, ఉపకార వేతనాలు, ఇంటర్న్‌షిప్పులు, స్టార్టప్ ఇంక్యుబేషన్, ప్లేస్‌మెంట్ అవకాశాల్లో ఈ సంస్థలు మద్దతు ఇస్తాయి.

ప్రపంచ స్థాయి ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో భారత్‌ను అంతర్జాతీయ శక్తిగా మార్చడమే లక్ష్యమని ఐఐసీటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ విశ్వాస్ దేవోస్కర్ తెలియజేశారు. అభివృద్ధి చెందుతున్న భారతీయ సృజనాత్మక సామర్థ్యానికి అనుగుణంగా ఉంటూనే అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్టుగా కోర్సులను రూపొందించారు. వివరణాత్మకమైన పాఠ్యాంశాలను ఈ నెల చివరిలో ప్రకటిస్తారని భావిస్తున్నారు.

ఐఐసీటీ బోర్డులో శ్రీ సంజయ్ జాజు, శ్రీ వికాస్ ఖర్గే, శ్రీమతి స్వాతి మాసే, శ్రీ చంద్రజిత్ బెనర్జీ, శ్రీ ఆశీష్ కులకర్ణి, శ్రీ మన్వేంద్ర షుకుల్, శ్రీ రాజన్ నవానీ ఉన్నారు. పాలకమండలిలో శ్రీ ముంజాల్ ష్రాఫ్, శ్రీ చైతన్య చిచ్లీకర్, శ్రీ బీరెన్ ఘోష్, శ్రీ భూపేంద్ర కైంతోలా, శ్రీ గౌరవ్ బెనర్జీ ఉన్నారు.

ఏవీజీసీ-ఎక్స్ఆర్ పరిశ్రమ అసాధారణంగా అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్న నేపథ్యంలో ఐఐసీటీ సమగ్ర కోర్సులను అందిస్తోంది.

భారత సృజనాధారిత ఆర్థిక వ్యవస్థకు తోడ్పడే, ఇమర్సివ్, డిజిటల్ కంటెంట్ సాంకేతికతల్లో దేశాన్ని అంతర్జాతీయ స్థాయి అగ్రగామిగా నిలబెట్టే, భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా ప్రతిభావంతులను తయారు చేయడమే వీటి లక్ష్యం.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి - జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్, జులై 17:(నేటినిజం ప్రతినిధి): గురువారం కలెక్టరేట్లోని ఎన్ఐసి హాలులో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, జడ్పీ సీఈవో పురుషోత్తం, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో వేగం పెంచాలని ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇప్పటికే మంజూరు అయిన లబ్ధిదారుల యొక్క వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి నిర్మాణం దశలవారీగా బిల్లులు మంజూరు చేయుటకు సంబంధిత సిబ్బంది ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు, మండలాల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ దశలను తనిఖీ చేయాలని, అవసరం ఉన్నచోట తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు, స్వయం సహాయక బృందాలలో ఉన్న మహిళల ఇందిరమ్మ లబ్ధిదారులకు వడ్డీ లేని రుణాల ద్వారా ఇంటి నిర్మాణానికి స్వీకరించాలని



సూచించారు, ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు.

# పేదల సొంతింటి కలను నేరవేర్చడమే లక్ష్యం : ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్గొండ, జులై 17: పేదల సొంతింటి కల నేరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం కట్టంగూర్ మండలంలోని గార్లబాయి గూడెం, చెర్వుఅన్నారం, రామచంద్ర పురం, అయిటిపాముల, కట్టంగూర్, ముత్యాలమ్మగూడెం, ఉగినవెల్లి, ఎరసానిగూడెం, పామనుగుండ్ల, భాస్కర్లబాయి, పిట్టంపల్లి, ఇస్మాయిల్పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? అర్హులైన ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలని, విడతల వారిగా డబ్బులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ్మా, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, నాయకులు రెడ్డిపల్లి సాగర్, పులిగిల్ల అంజయ్య, నంద్యాల వెంకట్ రెడ్డి, బెజవాడ సైదులు, ఎడ్ల పెద రాములు, ముత్యాల లింగయ్య, మిట్టపల్లి శివ, మంత్రి రాజు, సుంకరబోయిన వెంకన్న, వనం రాంబాబు, బండారు కృష్ణ, చౌగోని సాయిలు, గద్దపాటి దానయ్య, మాద లింగస్వామి, రెడ్డిపల్లి స్వామి, ముక్కాముల శేఖర్, అయితగోని నర్సింహ్మా, దార భిక్షం, బూరుగు శ్రీను, గట్టిగొర్ల సత్తయ్య, చెరుకు శ్రీను పాల్గొన్నారు.

# విజయవాడ నారాయణ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య

అమరావతి, జులై 17:విజయవాడ భవానిపురంలోని నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి జీవన్‌సాయి ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకోవడం తీవ్ర విషాదానికి దారితీసింది.

జీవన్‌సాయి ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విద్యార్థులపై అకడమిక్ ప్రెషర్, అధిక ర్యాంకుల కోసం పోటీ, వ్యక్తిగత సమస్యలు వంటి కారణాలు ఇలాంటి ఘటనలకు దారితీసే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తు ఉండగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడుతున్న కొద్దీ పూర్తి సమాచారం అందిస్తామని అధికారులు తెలిపారు.

# బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

బ ఎదురెదురుగా వస్తున్న మోటార్ సైకిల్, లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామేపల్లి మండల పరిధిలోని అడవి మద్దులపల్లికి చెందిన దుగ్గి సూర్యనారాయణ (56) పని మీద బైక్‌పై కారేపల్లి మండలం గాంధీనగరంకు వెళ్లి ఇంటికి తిరిగి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఇల్లెందు ఖమ్మం ప్రధాన రహదారిపై ఊట్కూర్ బస్ స్టేజి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్యాంకర్ లారీ సూర్యనారాయణ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, జులై 17:2025-26లో ప్రారంభమై, ఆరేళ్ళ పాటు కొనసాగే "ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజన'' కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ రోజు ఆమోదం తెలిపింది. 100 జిల్లాల్లో అమలయ్యే ఈ పథకం, నీతీ ఆయోగ్ 'ఆకాంక్ష జిల్లాల' కార్యక్రమం నుంచి స్ఫూర్తి పొందింది. వ్యవసాయం, అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టే తొలి కార్యక్రమం ఇదే కావడం గమనార్హం.

వ్యవసాయ ఉత్పాదకత పెంపు.. పంటల్లో వైవిధ్యం.. పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతుల అనుసరణ? పంచాయితీ, బ్లాక్ స్థాయుల్లో గోదాముల సామర్థ్య పెంపు? వంటలకు సాగునీటి సౌకర్యాల పెంపు? స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణ సౌకర్య కల్పన వంటి చర్యల ద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేయాలని పథకం భావిస్తోంది.

2025-26 బడ్జెట్ లో ప్రకటించిన విధంగా "ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజన" ద్వారా 100 జిల్లాలను అభివృద్ధి పరచడం పథకం లక్ష్యం. 11 విభాగాలకు సంబంధించి... రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రైవేటు రంగంతో భాగస్వామ్యం ఉన్న పథకాలతో కలిపి ప్రస్తుతం అమల్లో ఉన్న 36 పథకాల సమన్వయం ద్వారా పథకం అమలవుతుంది.

తక్కువ దిగుబడులు, పరిమితమైన విస్తరణ, పరిమితమైన వ్యవసాయ రుణాల పంపిణీ అంశాల ఆధారంగా దేశంలోని 100 జిల్లాలను గుర్తిస్తారు. సాగు భూమి, వ్యవసాయానికి పనికి వచ్చే భూమి విస్తీర్ణం ఆధారంగా ఒక్కో రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన జిల్లాల ఎంపిక జరుగుతుంది. అయితే, ఒక్కో రాష్ట్రం నుంచి కనీసంగా ఒక జిల్లాను కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటారు.

పథకానికి సంబంధించి సమర్థవంతమైన ప్రణాళికలు, ఆచరణ, పర్యవేక్షణ కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో కమిటీలు ఏర్పాటవుతాయి. స్థానిక అభ్యుదయ రైతులు కూడా భాగమయ్యే జిల్లా ధన-ధాన్య సమితి? జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేస్తుంది. వంట వైవిధ్యం... వ్యవసాయ నేలలు, సాగు నీటి ఆరోగ్య పరిరక్షణ... వ్యవసాయం, అనుబంధ రంగాల్లో స్వయం సమృద్ధి... సహజ, సేంద్రీయ వ్యవసాయ విస్తరణ జాతీయ లక్ష్యాలతో, జిల్లా ప్రణాళికలను అనుసంధానిస్తారు. ఒక్కో ధన-ధాన్య జిల్లాలో పథకం సాధించిన అభివృద్ధిని 117 కీలక సూచీల ఆధారంగా నెలవారీ పర్యవేక్షిస్తారు. జిల్లా ప్రణాళికలను నీతీ ఆయోగ్ కూడా సమీక్షించి మార్గనిర్దేశనం చేస్తుంది. అంతేకాక, పథకం పురోభివృద్ధిని ప్రతి జిల్లాకు నియమితులైన కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారులు క్రమం తప్పక సమీక్షిస్తారు.

100 జిల్లాల నిర్దేశిత లక్ష్యాలు మెరుగవడంతో, మొత్తం దేశానికి కీలక సూచీల ఆధారంగా లెక్కించే ప్రగతి కూడా పెరుగుదల నమోదు చేస్తుంది. ఈ పథకం ద్వారా అధిక దిగుబడులు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు విలువ జోడింపు, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పన, తద్వారా దేశీయోత్పత్తి పెంపు, స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం) సాధ్యపడతాయి. ఎంపిక చేసిన వంద జిల్లాల్లో సూచీలు మెరుగుదల కనపరిస్తే, సహజంగానే జాతీయ సూచీల్లో కూడా ఎదుగుదల కనిపిస్తుంది.

# పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విషయంలో ఎన్‌టీపీసీకి వెసులుబాటు కల్పిస్తూ క్యాబినెట్ నిర్ణయం..

న్యూఢిల్లీ, జులై 17:హరిత ఇంధనోత్పత్తిలో మహారత్న హోదా కలిగి ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టీపీసీకి మరింత ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఎన్‌టీపీసీ దాని అనుబంధ సంస్థ అయిన ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జీఈఎల్), అదే తరహాలో ఎన్‌జీఈఎల్ దాని అనుబంధ సంస్థ అయిన ఎన్‌టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్ఆర్ఈఎల్), దాని ఇతర జాయింట్ వెంచర్లు లేదా అనుబంధ సంస్థల్లో హరిత ఇంధనోత్పత్తికి సంబంధించి పెట్టుబడి పెట్టేందుకు ఉన్న రూ. 7000 కోట్ల పరిమితిని రూ. రూ. 20 వేల కోట్లకు పెంచింది. 2032 నాటికి 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఎన్‌టీపీసీ, ఎన్‌జీఈఎల్‌లకు ఇచ్చిన ఈ వెసులుబాటు దేశంలో పునరుత్పాదక ప్రాజెక్టుల ఏర్పాటును వేగవంతం చేసేందుకు ఉపయోగపడనుంది. విద్యుత్ మౌలిక సదుపాయాలను పెంచటంతో పాటు దేశవ్యాప్తంగా 24 గంటలూ విశ్వసనీయంగా విద్యుత్ ను అందించేందుకు పెట్టుబడులు అందివచ్చేలా చూడటంలో ఈ నిర్ణయం కీలకపాత్ర పోషించనుంది.

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు నిర్మాణ దశతో పాటు ఉత్పత్తి, నిర్వహణ సమయంలో స్థానిక ప్రజలకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. దేశంలో ఆర్థిక సామాజికాభివృద్ధి, పారిశ్రామిక సంస్థల ఏర్పాటుకు అవకాశాలను ప్రోత్సహించటంతో పాటు స్థానిక సరఫరాదారులు, స్థానికంగా ఉన్న సంస్థలు లేదా చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేస్తుంది.

స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 శాతం శిలాజేతర ఇంధనాల నుంచి రావాలన్న లక్ష్యాన్ని పారిస్ ఒప్పందంలో భాగంగా భారత్ నిర్దేశించుకుంది. దీనిని ఐదు సంవత్సరాల ముందుగానే సాధించింది. ఇది దేశ ఇంధన పరివర్తనలో ముఖ్యమైన ఘట్టం. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యానికి చేరుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా, దేశంలోని ప్రముఖ విద్యుత్ సంస్థగా ఎన్‌టీపీసీ.. 2032 నాటికి 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అదనంగా సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ముందు పేర్కొన్న లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడటమే కాకుండా 2070 నాటికి 'నికర సున్నా' ఉద్గారాలను సాధించాలనే విశాల లక్ష్యాన్ని సాధించటంలో ఉపయోగపడుతుంది.

సంస్థాగత, లేదా ఇతర పద్ధతుల ద్వారా పెట్టుబడులు పెట్టడం లేదా కొనుగోలు చేయటం ద్వారా పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని అదనంగా సాధించేందుకు ఉద్దేశించిన ఎన్‌టీపీసీ ప్రతిష్ఠాత్మక అనుబంధ సంస్థ... ఎన్‌జీఈఎల్. ఎన్‌జీఈఎల్ అనుబంధ సంస్థ అయిన ఎన్ఆర్ఈఎల్ యాజమాన్యం పూర్తిగా దీని ఆధీనంలోనే ఉంది. దీని ద్వారా సహజ వృద్ధి సాధించాలనేది వ్యూహం కాగా.. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులను చేపట్టేందుకు ఎన్‌జీఈఎల్ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సీపీఎస్‌యూలతో భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకుంది. దాదాపు 32 గిగావాట్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని ఎన్‌జీఈఎల్ కలిగి ఉంది. ఇందులో దాదాపు 6 గిగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. దాదాపు 17 గిగావాట్ల ఉత్పత్తి కాంట్రాక్టు పద్ధతిలో లేదా వివిధ సంస్థల ద్వారా జరుగుతోంది. దాదాపు 9 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యానికి సంబంధించిన ప్రాజెక్టులను చేపట్టేందుకు సిద్ధంగా ఉంద.

# పంచాయతీ అభివృద్ధి సూచికపై అవగాహన



ఖమ్మం, జులై 17: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గల సమావేశపు మందిరంలో గురువారం ఎంపీడీఓ ఎన్.రాజేశ్వర్ ఆధ్వర్యంలో మండల పంచాయతీ అభివృద్ధి సూచికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి సూచికల్లో భాగంగా గ్రామీణా భీవృద్ధికి దోహదపడే వివిధ అంశాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలులో భాగంగా తీసుకున్న సూచికలు, ప్రశ్నావళులు, డేటా సేకరణ, ఆ డేటా అప్‌లోడ్ ప్రక్రియ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆధార్ డేటాబేస్ కచ్చితత్వం-సమగ్రత పరిరక్షణపై 'యూఐడీఏఐ' ముందుచూపు...

న్యూఢిల్లీ, జులై 17:దేశంలోని ఆధార్ కార్డుదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా తమ గుర్తింపు ధ్రువీకరణకు విశిష్ట గుర్తింపు జారీ ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ప్రత్యేక గుర్తింపు సంఖ్య, డిజిటల్ వేదిక ద్వారా వెసులుబాటు కల్పించింది. భారత పౌరులతోపాటు ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) అందరికీ 12 అంకెలతో ప్రత్యేక డిజిటల్ గుర్తింపు సంఖ్యను 'యూఐడీఏఐ' జారీచేస్తుంది. ఇది ఎలాంటి మేధా ప్రక్రియతో నిమిత్తం లేకుండా యాదృచ్ఛికంగా రూపొందించే సంఖ్య కావడం వల్ల 12 అంకెలున్న ఇతర సంఖ్యలేవీ ఆధార్ నంబర్లుగా చలామణీ కావు. ఆధార్ సంఖ్యను ఒకసారి.. ఒకరికి మాత్రమే కేటాయిస్తారు. ఈ నేపథ్యంలో మృతుల ఆధార్ దుర్వినియోగం కాకుండా చూడటమేగాక గుర్తింపు పరమైన మోసాల నిరోధం దిశగా వారి ఆధార్ చెల్లుబాటు నిలిపివేత అవశ్యం.

అయితే, ఈ చర్యకు ముందు సదరు మృతుల ఆధార్ కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులు పూర్తిచేసుకోవాల్సిన కార్యక్రమాలకు ఇబ్బంది కలగకుండా మరణ నిర్ధారణ ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. అందుకే, ఆధార్ డేటాబేస్ నిరంతర కచ్చితత్వం కొనసాగే విధంగా వివిధ వనరుల ద్వారా మరణ రికార్డులు సేకరించి, ధ్రువీకరణ తర్వాతనే వారి ఆధార్ నంబర్ల చెల్లుబాటును నిలిపివేయాలని 'యూఐడీఐఏ' నిర్ణయించింది.

1. ఇందులో భాగంగా ఆధార్ అనుసంధానిత మరణ రికార్డుల వివరాలను తమకు ఇవ్వాల్సిందిగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ)ని ఇటీవల అభ్యర్థించింది. దీంతో ఇప్పటిదాకా సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) ద్వారా 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సమీకరించిన సుమారు 1.55 కోట్ల మరణ రికార్డులను 'ఆర్‌జీఐ' అందజేసింది. ఈ సమాచారాన్ని సముచిత రీతిలో తనిఖీ చేసిన అనంతరం వీటిలో దాదాపు 1.17 కోట్ల ఆధార్ నంబర్ల చెల్లుబాటును 'యూఐడీఏఐ' నిలిపివేసింది. మరోవైపు 'సీఆర్ఎస్' పరిధిలో లేని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోనూ ఈ చర్యలు కొనసాగుతున్నాయి. వీటికి సంబంధించి ఇప్పటిదాకా దాదాపు 6.7 లక్షల రికార్డులు అందగా, వాటి పరిశీలన-నిలిపివేత ప్రక్రియ కొనసాగుతోంది.

2. ప్రస్తుతం 'సీఆర్ఎస్' వ్యవస్థను వినియోగించే 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మరణాల నమోదు కోసం 2025 జూన్ 9 నుంచి 'మైఆధార్' (ఎంఎంజీటప్రజీజీతీ) పోర్టల్‌లో "కుటుంబ సభ్యుల మరణ సమాచార నివేదన" పేరిట కొత్త సేవను ప్రారంభించింది. ఈ సదుపాయం ద్వారా మృతుల వివరాలను కుటుంబ సభ్యులు నివేదించవచ్చు. ముందుగా కుటుంబ సభ్యులు తమ గుర్తింపును ధ్రువీకరించుకుని, అటుపైన ఆధార్ నంబరు, మరణ నమోదు ధ్రువీకరణ నంబరు సహా మృతుల జనసంఖ్యా సంబంధ వివరాలను నివేదించాలి. ఈ సమాచార ఆధారంగా సముచిత ధ్రువీకరణతో మృతుల ఆధార్ నంబరు చెల్లుబాటు నిలిపివేత లేదా ఇతరత్రా చర్యలు చేపడతారు. ఈ నేపథ్యంలో 'సీఆర్ఎస్' వ్యవస్థ లేని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ పోర్టల్ అనుసంధాన ప్రక్రియ కొనసాగుతోంది.

3. దీంతోపాటు బ్యాంకులు, ఆధార్ నమోదు-సమాచార నిర్వహణ వ్యవస్థలు, సంస్థల నుంచి మరణ రికార్డుల సమాచారం సేకరణ అవకాశాన్ని కూడా 'యూఐడీఏఐ' అన్వేషిస్తోంది.

4. అంతేకాకుండా మరణించిన ఆధార్ కార్డుదారుల గుర్తింపులో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కూడా తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆధార్ కార్డుదారులు సజీవులేనా కాదా అన్నది నిర్ధారించుకోవాలని నిర్ణయించింది. ఆ మేరకు 100 సంవత్సరాలు పైబడిన కార్డుదారుల జనసంఖ్యా సంబంధ వివరాలను రాష్ట్రాల నుంచి సేకరిస్తోంది. ఈ మేరకు ధ్రువీకరణ అందిన తర్వాత సదరు ఆధార్ నంబర్ చెల్లుబాటు నిలిపివేత కోసం నిర్ధారణ ప్రక్రియ చేపడతారు.

ఎవరైనా మరణించినపుడు వారి ఆధార్ నంబరు దుర్వినియోగం కాకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త వహించాలని 'యూఐడీఐఏ' దేశ ప్రజలకు సూచిస్తోంది. మృతుల ఆధార్ దుర్వినియోగం నిరోధం దిశగా కుటుంబ సభ్యులు సంబంధిత అధికారి నుంచి మరణ ధ్రువీకరణ పత్రం స్వీకరించిన తర్వాత మరణ సమాచారాన్ని 'మైఆధార్' పోర్టల్‌లో నివేదించాలని కోరింది.

# ఆయిల్‌పామ్ సాగుతో మెరుగైన ఆదాయం : ఉద్యానవన అధికారి అనంతరెడ్డి




నల్గొండ, జులై 17:వరికి ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి మెరుగైన ఆదాయం పొందాలని నల్లగొండ జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి అన్నారు. గురువారం నిడమనూరు మండల పరిధిలోని వేంపాడు గ్రామ శివారులో ఏమిరెడ్డి లక్ష్మమ్మ వేణుధర్‌రెడ్డికి చెందిన 11.5 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్య పంటగా ప్రసిద్ధి చెందిన ఆయిల్‌పామ్ సాగు ద్వారా అధిక దిగుబడితో పాటు వరి పంట కంటే రూ.లక్షన్నర వరకు ఆదాయం గడించవచ్చన్నారు. ఆయిల్ పామ్ మొక్కను ఒకసారి నాటితే నాల్గొవ ఏడాది నుండి నిర్విరామంగా 30 సంవత్సరాల వరకు సరాసరిన 10 నుంచి 12 టన్నుల దిగుబడి తీసుకోవచ్చని వివరించారు.

ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలను తట్టుకునే ఆయిల్‌పామ్ సాగును రైతులు చేపట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు నూరు శాతం రాయితీపై మొక్కలను ప్రభుత్వం అందిస్తుందని, డ్రిప్ పరికరాలకు సైతం రాయితీని కల్పిస్తుందన్నారు. సాంప్రదాయ వంటల నుండి ఆయిల్‌పామ్, ఉద్యాన పంటల సాగును చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు ఉద్యానవన అధికారి జి.రిషిత, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు భరత్‌కుమార్, ప్రసాద్, రాంప్రసాద్, సతీశ్, కోటేశ్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు సురుగురు రాజశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.




# పేదల సొంతింటి కల సాకారం : కొప్పోలు స్వర్ణలత

అమరావతి, జులై 17:ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని నిడమ నూరు మండల కాంగ్రెస్ నాయకురాలు కొప్పోలు స్వర్ణలత, వెనిగండ్ల పీఏసీఎస్ డైరెక్టర్ పోలె రవి అన్నారు. మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలో గురువారం లబ్ధిదారులకు మంజూరైన ఇంటి నిర్మాణ పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభు త్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతి ష్టాత్మకంగా అమలు చేస్తుందన్నా రు. లబ్ధిదారులు ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, పాల్గొన్నారు.

# భయం వీడితే జయం మనదే : వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాజశేఖర్




నల్గొండ, జులై 17: భయం వీడితే విజయం మనదే అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగుండ్ల రాజశేఖర్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలను అర్థం చేసుకుని చదువాలన్నారు. ప్రతీ నిత్యం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవాలన్నారు. ఎవరితో ఎలా నడుచుకోవాలో, సమస్యలు వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలో, ఒత్తిడికి లోను కాకుండా ఉండడం, ఉత్తమ ఫలితాలు సులభంగా సాధించేందుకు కావాల్సిన సాధన తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ప్రపంచ జ్ఞానం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ విజయకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బనకచర్లను ఆపేందుకు ఎందాకైనా పోరాడుతాం.. కెటిఆర్

**-సీఎం రేవంత్ నిర్ణయం మారకపోతే మరో ఉద్యమం**
**-ఇరిగేషన్‌పై రేవంత్‌కు అవగాహన లేదు**
**-గోదావరి జలాలపై బీజేపీ వైఖరి చెప్పాలి**
**-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

రాజన్న సిరిసిల్ల, జులై 17:(నేటి నిజం ప్రతినిధి): గోదావరి జలాలపై కేంద్రంలోని బీజేపీ వైఖరి చెప్పాలని, బనకచర్లపై పోరాటానికి ఎందాకైనా సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ నీళ్లను తీసుకుపోతామంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. ఏపీతో చర్చల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఉపసహరించుకోవాలని, ఒకవేళ నిర్ణయం మారకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. తెలంగాణలో కోవర్టు పాలన నడుస్తోందని ఎద్దేవా చేశారు.

గోదావరి జలాలపై బీజేపీ వైఖరి చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో సమావేశం పెట్టించింది, కమిటీ వేసేది చంద్రబాబేనని, తెలంగాణకు మళ్లీ ద్రోహం చేసేందుకు పెద్ద కుట్రే జరుగుతోందని కామెంట్ చేశారు. ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్లపై పోరాటానికి ఎక్కడి వరకైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. నీళ్ల వాటాలు తేలాకే ఏ ప్రాజెక్ట్ చేపట్టాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి ఇరిగేషన్ గురించి తెలియదని.. ఆయనకు తెలిసింది రియల్ఎస్టేట్, బ్లాక్ మెయిల్ దందా లేనని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రాయలసీమకు కూడా ప్రయోజనం కలగాలనే ఆకాంక్షించారని.. చంద్రబాబులా ఎత్తులకు పైఎత్తులు వేస్తూ కుట్రలు చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు.

**మాకూ ఒక రోజు వస్తుంది.. పోలీసులకు కేటీఆర్ హెచ్చరిక**

మకూ ఒక రోజు వస్తుందని, పోలీసులకుబ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. । బీఆర్ఎస్ సోషల్‌మీడియా యాక్టివిస్ట్ దుర్గం శశిధర్ గౌడ్ అలియాస్ నల్లబాలు విషయంలో పోలీసుల తీరుపై కేటీఆర్ మండిపడ్డారు. ఎవరూ అధికారంలో శాశ్వతంగా ఉండరని.. తమకూ ఒక రోజు వస్తుందని తెలంగాణ డీజీపీ జితేందర్‌ను ఆయన హెచ్చరించారు. కొణతం దిలీప్ చేసిన ట్వీట్‌ను ట్యాగ్ చేస్తూ ఈ మేరకు కేటీఆర్ స్పందించారు.

